సాగు ప్రశ్నార్థకం!

- ఘంటసాల మండలంలో దిగువకు రాని సాగునీరు
- 3/2 చానల్ కింద నారు నోరెండుతోంది
- తాడేపల్లి – ఘంటసాలపాలెం వరకు కాల్వల వద్ద గండ్లు, మోటార్లు, ఇంజిన్లు


ఘంటసాలలో సాగునీరు లేక నెర్రెలిస్తున్న పొలాలు

ఘంటసాల: పట్టిసీమ నుంచి నీరు వచ్చేస్తోంది.. ప్రాజెక్టులకు ఇక జలకళ.. కృష్ణా నది నుంచి ప్రాజెక్టులకు నీరు వదిలామంటూ రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు ప్రచార ఆర్భాటాలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కానరావడం లేదు. దీంతో ఘంటసాల మండలంలో పలుచోట్ల సాగునీరు అందడం లేదు. కొన్ని చోట్లు నాట్లు వేసినా సాగునీరందక ఎండిపోతుండగా, మరికొన్నిచోట్ల నాటు వేయడానికి నీరు లేదంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకునేవారే కానరావడం లేదని వాపోతున్నారు. దీంతో మండలంలో పలుచోట్ల సాగు ప్రశ్నార్థకంగా మారింది.

3/2 చానల్ పరిధిలో..

ఘంటసాల గ్రామ పరిధిలోని 3/2 చానల్ పరిధిలో సుమారు నాలుగు వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. గతనెలలో భారీ వర్షాలు కురవడం, దీంతో పాటు మోటార్ల సాయంతో సుమారు 2,500 ఎకరాల్లో నాట్లు వేశారు. సాగునీరు వస్తుందని ఈ ప్రాంత రైతులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. సాగునీరు సకాలంలో రాలేదు. ఈ కారణంగా నాట్లు ఎండిపోవడంతోపాటు పొలాల్లో నెర్రెలిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

దిగువకు నీరు రాకుండా చేశారు

మండలంలో ఇంకా 1500 ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. కొద్దో గొప్పో నీరు వస్తుందనుకుంటు ఘంటసాల ఎగువన తాడేపల్లి వద్ద డ్రాప్, ఘంటసాలపాలెం వద్ద రైతులు కాల్వకు గండ్లు వేసి ఇంజిన్లు, విద్యుత్ మోటర్లు పెట్టి దిగువకు నీరు రాకుండా చేస్తున్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి దిగువ రైతులు తెలిపినా స్పందించడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సకాలంలో సాగు జరగకపోతే రెండో పంటైన మినుముకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. సాగునీరు అందక పొలాలు ఎండిపోతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధింత అధికారులు సాగునీరు విషయంలో స్పందించాల్సి ఉంది.


ఘంటసాల 3/2 చానల్‌లో అడుగంటిన సాగునీరు


ఘంటసాలపాలెం వద్ద కాల్వపై వేసిన గండ్లను చూపుతున్న రైతులు

రెండు రోజుల్లో 3/2 చానల్‌కు సాగునీరందిస్తాం

రెండు రోజుల్లో ఘంటసాల 3/2 చానల్ కాల్వకు సాగునీరందిస్తాం. సాగునీటి సమస్యను ఇరిగేషన్ డీఈ రావెల రవి కిరణ్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి ఘంటసాలపాలెం నుంచి ఘంటసాల వరకు కాల్వలో ఉన్న గండ్లు, ఇంజిన్లు, విద్యుత్ మోటర్లను తొలగించాలని చెప్పారు. కాల్వ వెంబడి తమ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసి ఘంటసాల గ్రామానికి సాగునీరు అందిస్తాం.

– టి.ప్రసాద్, ఇరిగేషన్ ఏఈ, శ్రీకాకుళం

ఇప్పటి వరకు నాట్లు వేయలేదు



3/2 చానల్ కింద 10 ఎకరాలు పొలాన్ని సాగు చేస్తున్నా. ఇప్పటి వరకు కనీసం నాట్లు వేయలేదు. గత నెల 16న కురిసిన భారీ వర్షాలకు నారుమడి పోయగా ఒక్కసారి మాత్రమే నీరు పెట్టాను. సాగునీరు దిగువకు రాకుండా ఎగువ రైతులు గండ్లు వేస్తున్నారని ఏఈ, డీఈల దృష్టికి తీసుకెళ్లినా కనీస స్పందన ఉండటం లేదు. అదను దాటితే రెండోపంట దెబ్బతింటుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించాలి.

– వేమూరి శివరామకృష్ణయ్య, రైతు, ఘంటసాల

పొలం ఎండిపోతోంది



సాగునీరు వస్తుందని ఆశతో 3/2 చానల్ పరిధిలో 8 ఎకరాలు కౌలు పొలం చేస్తున్నాను. ఇటీవల వచ్చిన వర్షాలకు నాట్లు వేశాను. ఇప్పటి వరకు కాల్వ సక్రమంగా రాకపోవడంతో నాట్లు ఎండిపోతున్నాయి. ఘంటసాలపాలెం వద్ద రైతులు గండ్లు వేసి దిగవకు నీరు రాకుండా చేశారు. పాలెం పరిధిలో 400 మీటర్లు కాల్వ మెరకగా ఉండటంతో సాగునీరు కిందకు రావడం లేదు. సమస్య పరిష్కరించాలని అధికారులను కోరుతున్నా. అయినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

– ఉప్పల వెంకన్న, కౌలురైతు, ఘంటసాల

సాగునీటిని వ్యాపారంగా వినియోగిస్తున్నారు



సాగునీరు సక్రమంగా అందకుండా వ్యాపారం చేస్తున్నారు. ఘంటసాల 3/2 చానల్‌కు కింద ఏడెకరాలు సాగు చేస్తున్నాను. సాగునీరు రాకుండా ఎగువ రైతులు గండ్లు వేస్తున్నారని చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు. రైతులు సాగునీటితో వ్యాపారం చేస్తున్నారు. కాల్వపై అనధికారికంగా విద్యుత్ మోటర్లు, ఇంజిన్లు పెట్టి దిగువకు సాగునీరు రాకుండా చేస్తున్నారు. నాట్లు వేసినవి ఎండిపోవడమే కాక పొలాలు నెర్రెలిస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– యార్ల శ్రీకాంత్, రైతు, ఘంటసాల

క్లుప్తంగా

శ్రీదుర్గా కోటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



కె. కొత్తపాలెం(మోపిదేవి): కె. కొత్తపాలెంలో కృష్ణానది ఒడ్డున కొలువుదీరిన శ్రీ దుర్గాకోటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ శ్రావణ మాసం పురస్కరించుకుని ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు 3వ తేదీ వరకు ప్రతి మంగళ, గురు, శుక్రవారాల్లో ఆయా రోజుల ప్రత్యేకత మేరకు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పూజలు, అభిషేకాలు ఉంటాయని వివరించారు.

పారిశుద్ధ్య సమస్యకు 'ప్రత్యేక' పరిష్కారం



మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం పురపాలక సంఘ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులతో సమస్యకు పరిష్కారం లభిస్తుందని కమిషనర్ సీహెచ్ వీవీఎస్ బాపిరాజు అన్నారు నగరంలోని 36వ డివిజన్ రాజుపేట ప్రాంతంలో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. వీటిని ఆయన పరిశీలించారు. ప్రత్యేక పారిశుద్ధ్య పనులతో..ఎప్పటి నుంచో ఉన్న మట్టిదిబ్బలను, ముళ్లకంపను తొలగించడం, డ్రెయిన్లలోని సిల్ట్ పూర్తిస్థాయిలో తొలగిస్తామన్నారు. రోడ్ల వెంట ఏర్పాటు చేస్తున్న బడ్డీ కోట్లను ఇతర ఆక్రమణలను తొలగిస్తామని తెలిపారు. ఈ పనులకు నగర ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, పారిశుద్ధ్య విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ.. ప్రతిభావంతులకు వరం

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి



చల్లపల్లి(అవనిగడ్డ): నిరుపేద ప్రతిభావంతులకు ట్రిపుల్‌ఐటీ వరమని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు చెప్పారు. చల్లపల్లి మండల పరిధిలోని నాదెళ్లవారిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన మేడేపల్లి జ్యోతి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన సందర్భంగా సంఘ ఆధ్వర్యాన సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా దేవరపల్లి మాట్లాడుతూ నిరుపేదలకు ఇంటర్, ఇంజినీరింగ్ విద్య అందని ద్రాక్షగా మారిన ఈ రోజుల్లో పదో తరగతి తర్వాత ట్రిపుల్‌ఐటీ ద్వారా ఉన్నత స్థాయికి ఎదగవచ్చని చెప్పారు. పురిటిగడ్డ ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదివి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడం సామాన్య విషయం కాదన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా నేతలు ఎం.సుబ్బారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరామర్శ



చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి పంచాయతీ పరిధిలోని నడకుదురు శివారు నాదెళ్లవారిపాలెంకు చెందిన వార్డు సభ్యురాలు జంపాన శివపార్వతి కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు సింహాద్రి వికాస్ సోమవారం పరామర్శించారు. ఇటీవల జన్మించిన శివ పార్వతి మనవడు వైద్యశాలలో మరణించగా వారి కుటుంబ సభ్యులను వికాస్ ఓదార్చారు. ఆయన వెంట నడకుదురు సర్పంచ్ గొరిపర్తి సురేష్, పార్టీ గ్రామ కన్వీనర్ జంపాన అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై అవగాహన



పెదకళ్లేపల్లి(మోపిదేవి): వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులకు పూర్తి అవగాహన అవసరమని డీఆర్‌సీ ఏడీఏ కె.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పెదకళ్లేపల్లి గ్రామ సచివాలయం-1లో సోమవారం రైతు సదస్సు నిర్వహించారు. ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ సాగు పద్ధతులు, గ్రామీణ విత్తనోత్పత్తితో ఉపయోగాలు, పాటించాల్సిన జాగ్రత్తలు, సహజ వ్యవసాయం, నేల, ఆరోగ్య కార్డుల ద్వారా నేచురల్ ఫార్మింగ్ చేయడం, ఎరువుల సిఫార్సుల సమతుల్య వినియోగంపై అవగాహన కల్పించారు. కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్త కె.రేవతి, బి.పద్మజ, మండల ఏవో కె.హెప్సిబారాణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

సకాలంలో ప్రజలకు నాణ్యమైన సేవలు

ఘంటసాల: సకాలంలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తామని పలు మండలాల్లో బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు తెలిపారు. ఘంటసాల మండల తహసీల్దార్‌గా బూసి విజయ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గూడూరు మండల తహసీల్దార్‌గా చేస్తున్న విజయ ప్రసాద్ ఎన్నికల బదిలీల్లో భాగంగా కాకినాడలో విధులు నిర్వహించగా ఎన్నికల అనంతరం ఘంటసాల మండలం వచ్చినట్లు తెలిపారు. పలువురు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.

గూడూరు తహసీల్దార్‌గా రాజ్యలక్ష్మి

గూడూరు: గూడూరు తహసీల్దార్‌గా డి.రాజ్యలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వై.శివశంకర్ నుంచి ఆమె ఛార్జి తీసుకున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో తూర్పు గోదావరి జిల్లాకు వెళ్లిన రాజ్యలక్ష్మి తిరిగి కృష్ణా జిల్లా గూడూరుకు వచ్చారు.

పెడన తహసీల్దార్‌గా అబ్దుల్ రహమాన్ మస్తానా

పెడన: పెడన తహసీల్దార్‌గా అబ్దుల్ రహమాన్ మస్తానా సోమవారం బాధ్యతలను స్వీకరించారు. తొలుత ఆయన మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణిని కలిసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. అనంతరం పెడన తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించిన మస్తానాకు డిప్యూటీ తహసీల్దార్ పూర్ణ చంద్రరావు, ఆర్‌ఐ మణికుమార్, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఆయన గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. గుడ్లవల్లేరులో విధులు నిర్వహిస్తూ సాధారణ ఎన్నికలకు ముందు తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. అక్కడ నుంచి జిల్లాకు రావడం, కృష్ణా జిల్లాలో పెడనకు కేటాయించారు.

చల్లపల్లి తహసీల్దార్‌గా వనజాక్షి

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి తహసీల్దార్‌గా వనజాక్షి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డీటీ కుమార్ ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా డీటీ, కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

బీజీకే జెడ్పీహెచ్‌ఎస్‌లో డీఈవో విచారణ

పెడన: అత్యధికంగా విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న భట్టు జ్ఞానకోటయ్య జెడ్పీ హైస్కూలు(బీజీకే జెడ్పీహెచ్‌స్)లో సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి తాహెరాసుల్తానా రెండున్నర గంటల పాటు విచారణ నిర్వహించారు. ఇక్కడ ఏమీ లేదని, ప్రతి పాఠశాలను తనిఖీ చేస్తున్నట్లుగానే అత్యధికంగా పిల్లలున్న ఇక్కడ తనిఖీ చేశారని తెలియజేశారు. వాస్తవంగా ఇక్కడ చదువుకుంటున్న పిల్లలకు ఉపాధ్యాయులు సక్రమంగా పాఠాలు బోధించడం లేదని, తరగతులకు రాకుండా ఉపాధ్యాయుల గదులకే పరిమితమవుతున్నారని, మీకు చదువులు కావాలంటే తోటమూల పాఠశాలకు పోవాలని కోప్పడుతున్నారని విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వెళ్లడంతో డీఈవో విచారణ చేపట్టినట్లుగా తెలుస్తోంది. కలెక్టర్ డీకే బాలాజీ సైతం ఈ పాఠశాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినట్లుగా విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు పూర్తిస్థాయిలో డీఈవో తాహెరాసుల్తానా, మధ్యాహ్న భోజన పథకం ఏడీ మనోహర్ నాయక్, గుడివాడ, మచిలీపట్నం డీవైఈవోలు పద్మరాణి, శేఖర్ సింగ్, పెడన ఎంఈవో-1, 2 దుర్గాప్రసాద్, హరనాథ్ ఈ విచారణలో పాల్గొన్నారు. పదో తరగతి విద్యార్థులను, ఉపాధ్యాయులను విడివిడిగా పిలిచి విచారణ చేయడమే కాకుండా పలువురు ఉపాధ్యాయులపై విద్యార్థులు లిఖితపూర్వకంగా కూడా ఫిర్యాదు చేసినట్లుగా తెలుస్తోంది. అయితే వీటన్నింటిని డీఈవో తాహెరాసుల్తానా కొట్టిపారేశారు. రొటీన్‌గా చెక్ చేయడానికి వచ్చినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం పథకంపై ఫిర్యాదులు రావడంతో పరిశీలించాలని డీఈవైవో శేఖర్‌సింగ్‌తో పాటు ఎంఈవోలను ఆదేశించామని, పాఠశాలకు రెగ్యులర్ హెచ్ఎం లేరని, ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న లక్ష్మీకోట్నిస్‌ను మార్చి తీర్థావతికి ఇవ్వనున్నట్లు డీఈవో తెలిపారు. ఏది ఏమైనా బీజీకే జెడ్పీహెచ్‌ఎస్‌కు పూర్వవైభోగాన్ని తీసుకువస్తామని డీఈవో పేర్కొన్నారు.


డీవైఈవో, ఎంఈవోలను పరిశీలించాలని ఆదేశిస్తున్న డీఈవో తహెరాసుల్తానా

అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉద్రిక్తం

పెడనలో అప్రమత్తమైన పోలీసులు

పెడన: పట్టణంలోని ఆరో వార్డులోని తులసి థియేటర్ సమీపంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివారం అర్ధరాత్రి మహిళలు అంబేడ్కర్ విగ్రహం చుట్టు చప్టా కట్టడానికి సిద్ధమవ్వడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేయడమే కాకుండా మచిలీపట్నం డీఎస్పీ అబ్దుల్ సుభానీ సోమవారం వేకువ జామున 3 గంటల వరకు చర్చలు జరిపారు. రెండు రోజులు సమయం ఇవ్వాలని, సున్నితమైన అంశమని, జిల్లా అధికారులను సంప్రదించి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది. డీఎస్పీ అబ్దుల్ సుభానీ, సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్ఐ సూర్యశ్రీనివాస్, తహసీల్దారు అబ్దుల్ రహమాన్ మస్తానా, టీపీవో ఏసుబాబు తదితరులు సమాచాలోచనలు, చర్చలు జరిపారు. పరిస్థితిని కలెక్టర్‌కు, ఎస్పీల దృష్టికి తీసుకెళ్లారు. 2018 నుంచి ఈ సమస్య ఉందని, చాలా సున్నితమైందని, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఇరువర్గాల వారిని అక్కడి నుంచి పంపేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారని మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య అన్నారు. అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ప్లాట్‌ఫాం దిమ్మె విషయంలో ఇరుపక్షాల మధ్య వాగ్వాదాలు జరుగుతున్నాయని, పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నామని, రెండు రోజులు సమయం కోరామని, పరిస్థితి చక్కదిద్దుతామన్నారు. ప్రస్తుత విషయం కోర్టు పరిధిలో ఉన్న నేపథ్యంలో గొడవలకు దిగవద్దని ఆయన కోరారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద కమిషనర్ వెంకటరామయ్య, ఎస్ఐ సూర్యశ్రీనివాస్

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

బంటుమిల్లి: పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)వైద్యాధికారి డాక్టర్ కె.సువర్చల పర్యవేక్షణలో పలు గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పెదతుమ్మిడి, ములపర్రు తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది దోమల మందును పిచికారి చేసి రోడ్ల వెంట, ఇళ్లలో, వీధుల్లో దోమల ఉత్పత్తికి కారణమయ్యే మురుగునీటి నిల్వలను తొలగించి బ్లీచింగ్, సున్నం చల్లారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తినవద్దని తదితర అంశాలపై సూచనలు చేశారు. మలేరియా, డెంగ్యూ వైరల్ జ్వరాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి బొడ్డు మంగమ్మ, సూపర్‌వైజర్లు ఏసురాజు, రజని, యూనస్, రాజారావు, బొడ్డు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కోనేరుసెంటర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచించారు. కోన గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు లాస్యహరిత గ్రామస్తులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సలహాలతో పాటు మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వాంతులు, విరేచనాలతో పాటు చలి, జ్వరం వచ్చినట్లైతే వెంటనే వైద్యుడిని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా గ్రామస్తులకు 14 రకాల వైద్య పరీక్షలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో పరమేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ డొక్కు నాగమణి, ఏఎన్ఎం వై.ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిబంధనలతో ఉర్దూ ఉపాధ్యాయులను బదిలీ చేయాలి

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని ఉర్దూ పాఠశాలలకు ప్రత్యేక నిబంధనలతో ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చేపట్టాలని, మైనార్టీ విద్యార్థులు ఉన్న హైస్కూళ్లలో ఉర్దూ అదనపు తరగతులను నిర్వహించడానికి బీఈడీ అర్హత ఉన్న ఉపాధ్యాయులను నియమించాలని స్వర్ణాంధ్రప్రదేశ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రియాజు హుస్సేన్, రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సాలార్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉర్దూ పాఠశాలలకు విద్యార్థుల రోల్‌తో సంబంధం లేకుండా ప్రతి ఉర్దూ స్కూల్‌కు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేటట్లుగా నిబంధనలను పొందుపరచాలని కోరారు. ఉర్దూ పాఠ్య పుస్తకాలు సకాలంలో అందించాలని వారు కోరారు.

శ్మశానవాటికకు రోడ్డు నిర్మించండి



కోడూరు: మండలంలోని ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామంలోని హిందూ శ్మశానవాటిక వద్దకు వెళ్లడానికి రోడ్డును నిర్మించాలని గ్రామస్తులు అధికారులకు వినతిపత్రం అందించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా పరిష్కార వేదిక గ్రీవెన్స్‌లో గ్రామస్తులు తమ సమస్యను వివరించారు. శ్మశానవాటిక పల్లంగా ఉండటంతో మృతదేహాల దహనం కష్టంగా మారిందని, దీంతో గ్రామస్తులు స్వచ్ఛందంగా నగదును సమకూర్చుకొని ముళ్లకంపను తొలగించి, కొంతమేర మేరక చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం శ్మశానం వద్దకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కాలిబాట వంతెన నుంచి హిందూ శ్మశానవాటిక వరకు రహదారిని నిర్మించడానికి మండల పరిషత్ నుంచి నిధులు కేటాయించాలని గ్రామస్తులు కోరారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఎంపీడీఓ శ్రీనివాసరావు గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

ఎరువుల ముడిసరుకుపై జీఎస్టీ తగ్గించాలి

ఎంపీ బాలశౌరి

చిలకలపూడి(మచిలీపట్నం): ఎరువుల ముడిసరుకుపై జీఎస్టీని తగ్గించాలని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి సోమవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌదరి మాట్లాడుతూ కేంద్రం నుంచి ప్రతినిధులతో కూడిన రాజ్యాంగ సంస్థ జీఎస్టీ కౌన్సిల్ సిఫార్సుతో జీఎస్టీ రేట్లు నిర్దేశించారన్నారు. ఎరువుల ముడి సరుకులపై జీఎస్టీ తగ్గింపు అంశాన్ని గతంలో చర్చించారని తెలిపారు. ఆ సమావేశంలో బయోఫెర్టిసైడ్స్‌పై జీఎస్టీని 18 నుంచి 12 శాతానికి తగ్గించాలని సిఫార్సు చేసిందని, కౌన్సిల్ తన 28వ సమావేశంలో ఎరువుల గ్రేడ్ ఫాస్పారిక్ యాసిడ్‌పై జీఎస్టీ నుంచి 12 నుంచి 5 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేసిందన్నారు. అయితే జీఎస్టీ కౌన్సిల్ జూన్ 22వ తేదీన జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు కేంద్ర మంత్రి వివరించారు.

విద్యుత్ ఉత్పత్తిలో న్యూక్లియర్ ఎనర్జీది ప్రముఖ పాత్ర



బంటుమిల్లి: విద్యుత్ ఉత్పత్తిలో న్యూక్లియర్ ఎనర్జీ ప్రముఖ పాత్ర పోషిస్తోందని బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ ఇంజినీరింగ్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్, స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ తమ్మన శ్రీరామచంద్రమూర్తి అన్నారు. సోమవారం పాఠశాల ఆవరణలో న్యూక్లియర్ ఎనర్జీ పాత్ర, రేడియేషన్ విధానాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ తమ్మన మాట్లాడుతూ దేశ భవిష్యత్తులో న్యూక్లియర్ సైన్సును ఏ విధంగా ఉపయోగించుకోవచ్చో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ శ్రీరామచంద్రమూర్తిని సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కె శోభ, సత్యం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

మచిలీపట్నంటౌన్: నగరంలోని భాస్కరపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంతంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ నెల ఆరో తేదీ మంగళవారం ఉదయం7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మచిలీపట్నం సబ్‌డివిజన్ ఈఈ ఎం.భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుకర్లబాద్, ఇంగ్లిష్ పాలెం, బచ్చుపేట, రామానాయుడుపేట, పరాసు పేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

ఘనంగా శ్రావణ మాసోత్సవాలు



అవనిగడ్డ: స్థానిక గీతామందిరంలో సోమవారం శ్రావణ మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజ్యలక్ష్మి అమ్మవారికి విశేష అలంకారం, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు దీవి నరసింహమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఆలయ ధర్మకర్త శ్రీహరి బాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం



పెదప్రోలు(మోపిదేవి): తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ రత్నమాల అన్నారు. పెదప్రోలు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిడ్డ శారీరక, మానసిక ఎదుగదలకు అవసరమైన కొవ్వులు, పిండి పదార్థాలు, ప్రోటీన్లు, విటమిన్లు వంటి పోషకాలన్నీ తల్లిపాలలో సమపాలలో ఉంటాయని వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో కామర్స్ డే



మచిలీపట్నం టౌన్: నగరంలోని శ్రీ పద్మావతి మహిళా హిందూ డిగ్రీ కళాశాలలో సోమవారం కామర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి సోమవారం కళాశాలలో కామర్స్ డే ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అకౌంటెంట్స్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి, టాక్స్ కన్సల్టెంట్, జీఎస్టీ ప్రాక్టీషనర్ సామ ఉపేంద్ర నాథ్, చార్టెడ్ అకౌంటెంట్స్ ఏ మణిరత్నం, కే వంశీధర్, ఐటీ కన్సల్టెంట్ తమ్మన రాజశేఖర్, పద్మావతి హిందూ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భారతి సింగరాజు, హిందూ కళాశాల ప్రిన్సిపాల్ కుటుంబరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

లాకులను పరిరక్షించండి

మోపిదేవి: కృష్ణా నది ఒడ్డు లంకగ్రామాలను ముంపు నుంచి కాపాడాలని జనసేన నేత కోసూరు రామాంజనేయులు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సీనియర్ అసిస్టెంట్ మోపిదేవి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. మోపిదేవి వార్పు నుంచి పెదకళ్లేపల్లి ఆర్సీ కరకట్టకు మధ్యలో ఉత్తరచిరువోలు లంక, అయోధ్య గ్రామాల వద్ద లాకులు శిథిలావస్థకు చేరాయి. కృష్ణానదికి వచ్చే వరద నీటికి పంటలు, లంకగ్రామాలు ముంపునకు గురై ఏటా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి నదికి వరదనీరు రాక ముందుగానే తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.